ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 119 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 8 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మెటాకు భారీ షాక్




**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ..మిగతా 2లో

## అమెరికాలో జన్మహక్కు
# పౌరసత్వం కఠినతరం

### కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు



**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో ..మిగతా 2లో

## వర్షాల కోసం10న... నాగార్జునసాగర్‌లో
# వరుణ యాగం



- సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని సంకల్పం
- రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన యాదగిరిగుట్ట పాలకమండలి
- పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్
- 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు

**హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించు కోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.



# పొత్తులు ఉండవు

### జీహెచ్ఎంసీలో బీజేపీ ఒంటరి పోరు

- రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ
- అనంతరం మీడియాతో మాట్లాడిన తెలంగాణ బిజెపి చీఫ్ రామచందర్ రావు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేసిన రామచందర్ రావు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ..మిగతా 2లో

# బోఫోర్స్.. సుఖాంతం

- ఏకైక అప్పీల్‌ను కొట్టేసిన సుప్రీం
- ఒకప్పుడు రాజకీయాలను కుదేపిసిన వ్యవహారం
- విచారణ కోసం రూ. 250 కోట్ల ప్రజాధనం వృధా

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**



భారత రాజకీయాల్లో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పెను సంచలనాలు సృష్టించిన బోఫోర్స్ లంచాల వ్యవహారం చట్టపరంగా శాశ్వతంగా ముగిసిపోయింది! ఈ కేసులో సుప్రీంకోర్టులో మిగిలి ఉన్న ఏకైక అప్పీల్‌ను కూడా సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేస్తూ గురువారం తుది తీర్పు వెలువరించింది. దీనితో ఈ వ్యవహారంతో ముడిపడి ఉన్న అన్ని న్యాయ ప్రక్రియలకు అధికారికంగా ముగింపు పడినట్లయింది. హిందూజా సోదరులతో పాటు స్వీడన్‌కు చెందిన ఆయుధ తయారీ సంస్థ 'ఏబీ బోఫోర్స్'పై ఉన్న అన్ని నేరపూరిత అభియోగాలను కొట్టేస్తూ 2005లో ఢిల్లీ హైకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ అడ్వకేట్ అజయ్ కే అగర్వాల్ ..మిగతా 2లో

# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్

- గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
- ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజుల రామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ..మిగతా 2లో

# విజయ్ విడాకుల కేసు ఉపసంహరణ



- పిటీషన్ వెనక్కి తీసుకున్న సీఎం విజయ్ భార్య..
- తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మలుపు

2




## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్
# కొత్త క్లౌడ్ రీజియన్

### ఏఐ సేవలకు మరింత ఊతం


2



# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్

మొదటి పేజీ తరువాయి...

ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకో సారి సమీక్షిస్తామని హెచ్‌ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్‌ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్‌ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.



# మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.



# పొత్తులు ఉండవు

మొదటి పేజీ తరువాయి...

ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)

బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే దీనికోసం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంధ్రాల (ఫంగస్) లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర్'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్-హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంధ్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందించారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక లెదర్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టికలేకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు.



# బోఫోర్స్..సుఖాంతం

మొదటి పేజీ తరువాయి...

దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పూర్తిగా నిరాకరించింది.

**"ఇక ఏ విచారణా లేదు"**

విచారణ సందర్భంగా, ఈ కేసులో నిందితులుగా ఉన్న శ్రీచంద్ పీ హిందూజా, గోపీచంద్ పీ హిందూజాలు ఇప్పటికే మరణించినందున వారి పేర్లను పిటిషన్ నుంచి తొలగించడానికి మరింత సమయం కావాలని అగర్వాల్ కోర్టును కోరారు. అయితే, ఈ విషయంలో ఇకపై ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేసిన బెంచ్, ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. 2005లోనే ఢిల్లీ హైకోర్టు ఈ కేసును పూర్తిగా కొట్టేసిందని, ఆ తీర్పుపై గతంలో సీబీఐ వేసిన అప్పీల్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించిందని ధర్మాసనం గుర్తుచేసింది. అటువంటప్పుడు ఈ విచారణను ఇంకా ఎందుకు కొనసాగించాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

**రూ.250 కోట్ల ప్రజాధనం వృథా!**

2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులపై ఉన్న అన్ని అభియోగాలను కొట్టివేస్తూ సంచలన తీర్పునిచ్చింది. అంతేకాకుండా, ఈ కేసు దర్యాప్తు కోసం సీబీఐ దాదాపు రూ. 250 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఆ తర్వాత, సుదీర్ఘంగా 4,522 రోజుల ఆలస్యం ముసుగులో సీబీఐ 2018 నవంబర్‌లో వేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా కొట్టివేసింది.

**అసలేమిటీ బోఫోర్స్ వివాదం?**

భారత ప్రభుత్వం, స్వీడిష్ ఆయుధ సంస్థ ఏబీ బోఫోర్స్ మధ్య 1986 మార్చి 24న రూ. 1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ ఫిరంగుల కొనుగోలు ఒప్పందం కుదిరింది. అయితే, ఈ కాంట్రాక్ట్ దక్కించుకోవడానికి భారత రాజకీయ నాయకులకు, రక్షణ అధికారులకు అక్రమంగా లంచాలు ఇచ్చారని 1987లో స్వీడిష్ రేడియో బహిర్గతం చేసింది. ఈ ఆరోపణలు దేశ రాజకీయాలను తీవ్రంగా షేక్ చేశాయి. ఏళ్ల తరబడి సాగిన ఈ చట్టపరమైన పోరాటం, తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పుతో పూర్తిగా తుది ఘట్టానికి చేరుకుంది.

# విజయ్ విడాకుల కేసు ఉపసంహరణ

చెంగల్పట్టు, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)

తమిళనాడు రాజకీయాల్లో, సినీ వర్గాల్లో అత్యంత ఆసక్తి రేకెత్తించిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, ఆయన భార్య సంగీత మధ్య నడుస్తున్న విడాకుల కేసులో అనూహ్య మలుపు తిరిగింది. తన వివాహ బంధాన్ని రద్దు చేయాలని కోరుతూ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను సంగీత వెనక్కి తీసుకున్నారు. శుక్రవారం నాడు జరిగిన విచారణలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉన్న విడాకుల కేసును సంగీత పసంహరించుకోవడంతో, న్యాయమూర్తి ఆ కేసును కొట్టివేశారు. సంగీత ఈ విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకుండా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరయ్యారు. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి గల కారణాలను ఆమె న్యాయమూర్తికి వివరించినట్టు సమాచారం. ఈ పరిణామంతో ముఖ్యమంత్రి విజయ్ వైవాహిక జీవితంపై సాగుతున్న ఊహాగానాలకు ప్రస్తుతానికి తెరపడింది. వివాదం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైంది. సంగీత తన పిటిషన్‌లో విజయ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. 2021లో విజయ్ ఒక మహిళా నటితో సంబంధం కలిగి ఉన్నట్టు తాను గుర్తించానని, దానిని ఆపమని కోరినప్పటికీ ఆయన పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.



విజయ్ తనను సామాజిక, వృత్తిపరమైన కార్యక్రమాలకు దూరం పెట్టారని, అదే సమయంలో సదరు నటితో కలిసి బహిరంగంగా తిరుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో విజయ్, ఆ నటి కలిసున్న ఫొటోలు వైరల్ కావడంతో తనను, తన ఇద్దరు పిల్లలను తీవ్ర అవమానానికి గురి చేసిందని ఆమె గతంలో వాదించారు. విజయ్ తన స్వేచ్ఛను హరించడమే కాకుండా, ఆర్థికపరమైన పరిమితులు కూడా విధించారని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు.

**విచారణ సాగిందిలా**

ఈ ఏడాది ఫిబ్రవరిలో పిటిషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఈ కేసు పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. గత నెలలో జరిగిన విచారణకు విజయ్ లేదా సంగీత ఇద్దరూ వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆగస్టు 7కు కేసును వాయిదా వేశారు. అప్పటి వరకు ఇరు పక్షాల లాయర్లు మాత్రమే కోర్టుకు హాజరై, తమ క్లయింట్లు బిజీగా ఉండటం వల్ల రాలేకపోతున్నారని కోర్టుకు విన్నవించారు. విజయ్, సంగీతల వివాహం ఆగస్టు 25, 1999న చెన్నైలో సంప్రదాయ హిందూ పద్ధతిలో జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్ సినిమాల నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి, ఈ ఏడాది మే నెలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వేళ ఈ వైవాహిక వివాదం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. సంగీత తన పిటిషన్‌లో మనోవర్తితోపాటు చెన్నైలోని నీలంగరైలో ఉన్న తమ నివాసంలోనే ఉండేందుకు అనుమతి కోరినప్పటికీ, ఇప్పుడు కేసును ఉపసంహరించుకోవడం ద్వారా వారు తిరిగి కలిసి ఉండే అవకాశం ఉందా అన్న చర్చ మొదలైంది. ముఖ్యమంత్రిగా విజయ్ రాజకీయ ప్రస్థానంలో ఈ నిర్ణయం ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను కొంత ఊరటనిచ్చే విషయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి చెంగల్పట్టు కోర్టు ఈ వివాదాన్ని అధికారికంగా ముగించింది. భవిష్యత్‌లో ఈ దంపతులు తిరిగి కలిసి జీవిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్

# కొత్త క్లౌడ్ రీజియన్


హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) , ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరో-వాటర్ కూలింగ్" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

మొదటి పేజీ తరువాయి...

పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు) , ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు



ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# పుస్తెలతాడు చోరీ కేసులో ఒకరు అరెస్టు, మరొక్కరు పరార్





## నిందితుడ్ని నుంచి బంగారు పుస్తెల తాడు,నల్లపూసల పుస్తెల తాడు స్వాధీనం

## గంటల వ్యవధిలోనే నిందితుడ్ని పట్టుకున్న గద్వాల రూరల్ పోలీసులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7(ప్రభాత ఉదయం)**

ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న ఇద్దరు మహిళల మెడలో నుంచి మంగళసూత్రాలను చోరీ చేసిన నిందితుడ్ని గద్వాల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడ్ని నుంచి మంగళసూత్రాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితుల్లో ఒకరు అరెస్టు కాగ మరొక్కరు పరార్ అయ్యారు. శుక్రవారం గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ లో గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తో కలిసి గద్వాల సీఐ టి.శ్రీను వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర కు చెందిన రితిక్ షిండే, షోయం ఇద్దరు కలిసి గద్వాలలో ప్లాస్టిక్ సామాన్లు అమ్మేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గద్వాల మున్సిపాలిటి పరిధిలోని జమ్మిచేడులో 4, 5 వ వార్డులలో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న బుచ్చమ్మ మెడలోని నల్లపూసల పుస్తెల తాడు, పారిజాతమ్మ మెడలోంచి 2.5 తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకుని పరారయ్యారు. బాధితులు వెంటనే గద్వాల రూరల్ పోలీసులకు అందించారు. సమాచారం అందుకున్న గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గద్వాల సీఐ టి.శ్రీను ఆదేశాల మేరకు పోలీసులు గద్వాల ఆర్టీసి బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రితిక్ షిండే, షోయం లను తనిఖీ చేసే క్రమంలో షోయం పరారయ్యాడు. రితిక్ షిండేను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరికీ తామే పాల్పడినట్లు దర్యాప్తు లో తేలింది. పరారైన మరో నిందితుడు షోయం కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడు రితిక్ షిండే వద్ద నుంచి చోరికి గురైన పుస్తెల తాడు, నల్లపూసల పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని, రిమాండ్ కు తరలించారు. చోరీ కేసును త్వరితగితిన చేధించిన గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ ను, పోలీస్ సిబ్బందిని గద్వాల సీఐ అభినందించారు.



### చేనేతకు ప్రాధాన్యం..

# సంప్రదాయ వస్త్రాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 7(ప్రభాత ఉదయం)**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గద్వాలలో శుక్రవారం మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత భారతీయ సంస్కృతికి ప్రతీక అని, స్థానిక నేత కార్మికులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చేనేత వస్త్రాల వినియోగం పెంచడం ద్వారా నేత కార్మికుల జీవనోపాధికి తోడ్పాటు అందించడంతో పాటు మహిళల ఆర్థిక సాధికారతకు కూడా బలమైన ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థినులు స్వదేశీ చేనేత వస్త్రాలను ఆదరించి, చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.జి. లక్ష్మీ ప్రసాద్, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డా. ఎం. సమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి. జగన్ మోహన్, , ×ూజ కోఆర్డినేటర్ ఎం. దేవుజా, అకాడమిక్ కోర్డినేటర్ పి. సురేష్ బాబు, లక్ష్మీనారాయణ,సాయి తేజ, ఎం. వెంకటేష్, బ్రహ్మేశ్వర్ , చంద్రశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, శ్రీకాంత్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### మిట్టు బాబుపై దాడి చేసిన

# గుడ్డు కుమార్ అరెస్ట్

**బుద్వేల్, అగస్టు 7 (ప్రభాత ఉదయం) :**

దర్గా కలీజ్ ఖాన్ బస్తీలో గుడ్డు కుమార్ అనే యువకుడి పై మూడు రోజుల క్రితం జరిగిన హత్యాయత్నం కేసులో ఓ నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. దర్గా ఖలీస్ ఖాన్ ప్రాంతానికి చెందిన మిట్టు బాబు ను ఝూర్ఖండ్ రాష్ట్రానికి చెందిన గుడ్డు కుమార్, జితేంద్ర కుమార్ లు గొంతు కోసి హత్యాయత్నం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన రాజేంద్రనగర్ పోలీసులు నిందితులలో ఒకరైన గుడ్డు కుమార్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.



గుడ్డు కుమార్

# కెన్వర్త్ అపార్ట్మెంట్ నుంచి ఒకరు అదృశ్యం

**బుద్వేల్, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**



చిట్టి మోహన్

ప్రేమావతి పేట్ కెన్వర్త్ అపార్ట్ మెంట్ లో నివాసం ఉండే చిట్టి మోహన్ (55) ఈ నెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్య మయ్యారు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ ఎస్ ఐ రాజ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు



# నేడు మైలార్ దేవుపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, ఆగస్టు 7(ప్రభాత ఉదయం)**

నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైలార్ దేవ్ పల్లి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. జహంగీరాబాద్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలలో ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు క్రిస్టల్ టౌన్, మిలాత్ నగర్, నూరి నగర్, తులసి నగర్,జహంగీరాబాద్, ఇస్లామియా హిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



రాజేంద్రనగర్ లోని ఈ వీ ఎం గోదాము ను సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

# ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**బుద్వేల్, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్, గోడౌన్‌కు ఏర్పాటు చేసిన సీళ్లను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారతదేశంలోని ప్రతిష్టాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యురాలిగా డాక్టర్ బి. నిర్మల ఎంపిక

**బుద్వేల్, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం) :**



వ్యవసాయ , వృక్ష శాస్త్రాలకు చేసిన విశేష కృషికి గుర్తింపుగా నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్ ) లో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి. నిర్మల భారతదేశంలోని ప్రతిష్టాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ( ఎన్ ఎ ఎస్ ఐ) సభ్యురాలిగా ఎంపికయ్యారు. 1930లో స్థాపించబడిన ఎన్ఏఎస్ఐ భారతదేశపు అత్యంత పురాతన విజ్ఞాన అకాడమీ. ఇది విజ్ఞాన, సాంకేతిక రంగాలను ప్రోత్సహించడానికి, శాస్త్రీయ సమాచార మార్పిడికి మరియు పరిశోధనల వ్యాప్తికి ఒక జాతీయ వేదికను అందించడానికి అంకితమై ఉంది. భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక శాఖ మద్దతుతో, ఎన్ఏఎస్ఐ శాస్త్రీయ చర్చలు, ప్రచురణలు, విజ్ఞాన-సమాజ కార్యక్రమాలను కూడా చేపడుతుంది. 2007 వ్యవసాయ పరిశోధన సేవా బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నిర్మల, గతంలో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌లో పనిచేశారు. ఆమె 15 పరిశోధన ప్రాజెక్టులకు నాయకత్వం వహించడంతో పాటు, భారతదేశంలోని ప్రధాన వరి పండించే ప్రాంతాలలో విస్తృతమైన క్షేత్ర పరిశోధనను చేపట్టారు. ఆమె చేసిన పాండిత్యపరమైన కృషిలో పీర్-రివ్యూడ్ జర్నల్స్‌లో ప్రచురితమైన 88 పరిశోధనా పత్రాలు, 23 సాంకేతిక వ్యాసాలు, 14 పుస్తకాలు, 33 పుస్తక అధ్యాయాలు, ఏడు సాంకేతిక బులెటిన్‌లు మరియు 22 శిక్షణా మాన్యువల్‌లు ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి కార్యక్రమాలకు ప్రధాన పరిశోధకురాలిగా, ఆమె దేశవ్యాప్తంగా 12,468 క్షేత్రస్థాయి ప్రదర్శనలను సమన్వయం చేసి, మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని ప్రోత్సహించారు మరియు రైతులు సాగు ఖర్చులను తగ్గించుకోవడంలో సహాయపడ్డారు. ఆమె 65 శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించి, 14 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ , ముగ్గురు డాక్టరేట్ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. డాక్టర్ నిర్మల ఉత్తమ పరిశోధనా పత్రానికి డాక్టర్ ఆర్. టి. దోషి అవార్డు, సొసైటీ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ నుండి యంగ్ సైంటిస్ట్ అవార్డు , తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నుండి ఫెలో/అసోసియేట్ ఫెలో గుర్తింపుతో సహా పలు గౌరవాలను అందుకున్నారు. ఆమె మొబిలైజేషన్ సొసైటీలో ఫెలోగా కూడా ఉన్నారు.

# ఆషాడ మాస బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

## జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

## బోనాల వేడుకల దృష్ట్యా మౌలిక సదుపాయాలు కల్పించాలి: మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

**రాజేంద్రనగర్,ఆగస్టు07(ప్రభాత ఉదయం)**



జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు యస్ వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రాజేంద్రనగర్ మండల పాలనా అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని కలిసి కాటేదాన్,మైలార్ దేవ్‌పల్లి డివిజన్లలో నెలకొన్న పలు ప్రజాసమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పలు దేవాలయాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు విస్తరించి ఉండటంతోపాటు,రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల బోనాలు ఎత్తుకుని వెళ్లే మహిళలు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేవాలయాల పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు,రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని కోరారు. కాలనీల్లో అనేక వీధిదీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,పనిచేయని వీధిదీపాలను మరమ్మతు చేయడంతోపాటు అవసరమైన చోట కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనుల పేరుతో తవ్విన రహదారులను తిరిగి సరిచేయకపోవడంతో ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని,వెంటనే వాటిని బాగు చేయాలని కోరారు. అలాగే,దశాబ్దాల క్రితం వేసిన మురుగునీటి పైపులు ప్రస్తుతం పెరిగిన జనాభాకు సరిపోక మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోందని తెలిపారు. ముందుగా పెద్ద మురుగునీటి పైపులు ఏర్పాటు చేసి,ఆ తర్వాత రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. వినతిపై స్పందించిన మండల పాలనా అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, బంగారయ్య, అశోక్,శశి, వెంకటరమణ,భాస్కర్, సురేష్,మోహన్,సింహాచలం,మహేందర్,నిఖిల్,చింటూ,కాటేదాన్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల చేనేత బ్రాండ్‌ను కాపాడుకోవాలి





## చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాల వర్తింపు.

## చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు.

## బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు కృషి:గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

గద్వాలలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు. పట్టు, కాటన్ సమ్మిళితం చేస్తూ గద్వాల చేనేత జరీ చీరలను నేస్తుంటారని, భౌగోళిక గుర్తింపును పొందిన ఈ బ్రాండ్ ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే సంఘాల ప్రతినిధులు బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన వివిధ పథకాలను అర్హులైన కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా జియో టాగ్ నెంబర్లను ఇప్పించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు తరాలు కూడా చేనేత వృత్తిలో ఆర్థిక పురోగతి సాధించేలా గద్వాల చేనేత రంగాన్ని పటిష్టం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక జనాభా చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తోందని, స్వాతంత్ర ఉద్యమంలోనూ గాంధీజీ విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. గద్వాల సంస్థానాధీశులు వందేళ్ళ కిందటే ఇక్కడి కొంతమంది చేనేత కళాకారులను బెనారస్ పంపించి వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ప్రోత్సహించారన్నారు.అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ... నేతన్నకు భరోసా, చేయూత, త్రిఫ్ట్ ఫండ్, భీమా, తదితర పథకాలతో ప్రభుత్వం చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలు బాధ్యతగా పనిచేసి ఇక్కడి కార్మికుల సంక్షేమానికి పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా చేనేత వస్త్రాలు నేయాలని, ఫలితంగా మార్కెటింగ్ అవకాశాలను విస్తృత పరుచుకోవచ్చన్నారు. ఇటీవల ప్రభుత్వం జిల్లాకు చెందిన చేనేత కార్మికుల రూ. 14.23 కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి మాస్టర్ వీవర్స్, సహకార సంఘాల ప్రతినిధులు చేనేత కార్మికుల పిల్లల చదువులకు, వైద్య అవసరాలకు సామాజిక బాధ్యతగా తమ వంతుగా తోడ్పాటును అందించాలని సూచించారు. గద్వాల చేనేత రంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, భవిష్యత్తు తరాలు కూడా చేనేత వ్యాపారాలతో ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే, ఇతర అతిధులు ఇటీవల నూతనంగా ఎన్నికైన జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘాల అధ్యక్షులను, సీనియర్ చేనేత కార్మికులను సన్మానించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా రూ. 85 లక్షల విలువైన నేతన్న భద్రత చెక్కును కార్మికులకు అందజేశారు. అంతకుముందు గద్వాలలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడి ఇందిర, పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నేతలు, మాస్టర్ వీవర్స్, చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



జైల్ భరో కరపత్రాన్ని అవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

# ‘జైల్ భరో’ను జయప్రదం చేయండి

## చందానగర్ పీజెఆర్ స్టేడియంలో ఐటీయూ కరపత్రాల ఆవిష్కరణ

## కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై మండిపడ్డ సీఐటీయూ నాయకుడు కొంగరి కృష్ణ

**శేరిలింగంపల్లి : ఆగస్టు 7,,(ప్రభాత ఉదయం)**

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ‘జైల్ భరో’ ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి కొంగరి కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొంగరి కృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకురావడమే కాకుండా అమెరికాతో కుదుర్చుకుంటున్న ఒప్పందాల వల్ల దేశంలో రైతాంగం పూర్తిగా నాశనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు భారతదేశానికి వస్తే ఇక్కడి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతారని వ్యవసాయ కార్మికులకు ఉపాధి కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలను, ప్రజా వ్యతిరేక ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జైల్ భరో నిర్వహిస్తున్నామని కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## పచ్చని పొలాలు

# ప్రకృతి పరవశం

”వాన చినుకుల ముద్దుతో
నేలమ్మ మేను పులకరించింది...
ఎండిన మడులన్నీ ఈనాడు
పచ్చని చీర కట్టుకున్నాయి!
పైరు గాలి ఊగుతుంటే
రైతు కంట్లో వెలుగులు నిండాయి,
ఆకుపచ్చని ఆశలన్నీ
నిండు పంటగా మారేందుకు సిద్ధమయ్యాయి!”



# మరోసారి పరమత సహనాన్ని చాటుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## రూ.25 లక్షల సొంత నిధులతో చోటి మసీదు భవన నిర్మాణానికి అండ

**పటాన్ చెరు, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

పరమత సహనం, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు.

పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎంజి రోడ్డు లో గల చోటి మసీదు ప్రార్థన స్థలానికి చెందిన స్థలంలో 25 లక్షల రూపాయల సొంత నిధులతో భవనాన్ని నిర్మించి మసీదు నిర్వాహకులకు అందించారు. ఈ మేరకు శుక్రవారం మత పెద్దల సమక్షంలో భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోటి మసీదు ఆర్థిక అవసరాలు తీర్చడంలో నూతన భవనం సహాయకారిగా ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవత్వాన్నే బోధిస్తాయని అన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందించడంలో భాగంగా నేటి వరకు సొంత నిధులతో 200 లకు పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, 20 కి పైగా చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, మొయిజుర్ రెహ్మాన్, ఇక్బాల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ మోటార్లపై జలమండలి విజిలెన్స్ కొరడా

## విజయనగర్ కాలనీలో 7 మోటార్లు సీజ్

**హైదరాబాద్, ఆగస్టు 7**

జలమండలి నీటి సరఫరా సమయంలో అక్రమంగా మోటార్లు వినియోగిస్తూ నీటిని తోడుతున్న వారిపై విజిలెన్స్ విభాగం చర్యలు చేపట్టింది. శుక్రవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు జలమండలి విజిలెన్స్ బృందం చింతల్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డి నగర్ వార్డు, విజయనగర్ కాలనీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న మొత్తం 7 అక్రమ మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకుంది. నీటి సరఫరా సమయంలో అక్రమంగా మోటార్లు ఉపయోగించడం వల్ల ఇతర వినియోగదారులకు తగినంత నీరు అందక ఇబ్బందులు తలెత్తుతాయని జలమండలి స్పష్టం చేసింది. వినియోగదారులు అక్రమ మోటార్లను వినియోగించవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# మూడు పదుల ఆక్రమణలకు చెక్

## అంజయ్య నగర్ వార్డు ఆఫీస్‌కు విముక్తి!

## డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ సమర్థవంతమైన చర్యలు -- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

## 30 ఏళ్ల కల నెరవేరిన వేళ శేరిలింగంపల్లి కాలనీవాసుల హర్షాతిరేకాలు.. బాధితులకు పునరావాస హామీ

**శేరిలింగంపల్లి : ఆగస్టు 07’ (ప్రభాత ఉదయం)**



అంజయ్య నగర్ వార్డు కార్యాలయం అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన సీఎంసీ అధికారులు...

కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు, ప్రజా ప్రయోజన భవనాలు కబ్జాదారుల చేతుల్లో చిక్కుకుని ఆక్రమణలకు గురవుతుంటే చూస్తూ ఊరుకోబోమని సర్కార్ యంత్రాంగం గట్టి హెచ్చరికలు జారీ చేసింది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్ వార్డు ఆఫీస్ ప్రాంగణాన్ని గత మూడు దశాబ్దాలుగా ఆక్రమించుకున్న కబ్జాదారుల ముఠాకు సీఎంసీ అధికారులు గట్టి షాక్ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఉన్నతాధికారుల స్పష్టమైన మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ నాయకత్వంలో అధికారులు శుక్రవారం ఉదయం మెరుపు దాడి నిర్వహించి వార్డు ఆఫీసు పరిసరాలను కబ్జా కోరల నుంచి విముక్తి చేశారు. గత ముప్పై ఏళ్లుగా నిరుపయోగంగా మారడంతో పాటు ఆక్రమణదారుల చేతుల్లో నలిగిపోయిన ఈ ప్రభుత్వ ఆస్తిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక కాలనీవాసులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంజయ్య నగర్ పరిధిలోని వార్డు ఆఫీస్ భవనం ప్రజా పరిపాలనకు, స్థానిక పౌర సేవలకు ఎంతో కీలకమైన కేంద్రం. అయితే గత 30 సంవత్సరాలుగా కొంతమంది అసాంఘిక శక్తులు, కబ్జాదారులు ఈ ప్రాంగణాన్ని తమ సొంత వ్యాపారాలకు అక్రమ నివాసాలకు వేదికగా మార్చుకున్నారు. ప్రభుత్వానికి చెందిన భూమి అయినప్పటికీ అధికారుల దృష్టి నివారణ వైపు మళ్లకుండా రకరకాల మార్గాల్లో ప్రాంగణాన్ని ఆక్రమించారు. సీఎంసీ యంత్రాంగం వార్డు స్థాయి సేవలను పటిష్టం చేయాలని భావించిన ప్రతీసారీ ఈ ఆక్రమణలు ప్రధాన అడ్డంకిగా మారాయి. వార్డు ఆఫీస్ ప్రాంగణం చుట్టూ అక్రమ నిర్మాణాలు ఏర్పడటంతో స్థానికులు తమ ఫిర్యాదులు అందజేయడానికి లేదా పౌర సేవల కోసం కార్యాలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. పక్కా ప్రణాళికతో ఉదయాన్నే మెరుపు దాడికమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించారు. ఆక్రమణల నివారణకు ప్రణాళిక రూపొందించి శుక్రవారం వేకువజామునే కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు.

**భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు:**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసుల సహకారంతో బుల్డోజర్ల సహాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. కూల్చివేతల ప్రక్రియ అంతటా డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించారు. గత కొన్ని సంవత్సరాలుగా అక్కడ చట్టవిరుద్ధంగా నివాసం ఉంటున్న వారిని గుర్తించి, స్థలాన్ని సంపూర్ణంగా సీఎంసీ స్వాధీనంలోకి తీసుకుంది. శేరిలింగంపల్లి పరిధిలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. “ప్రభుత్వ నిధులు, స్థలాలు కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే ఉపయోగపడాలి. ప్రభుత్వ భూములను ఆక్రమించే ఎంతటి వారినైనా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. వార్డు ఆఫీస్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించడం ద్వారా ఇకపై ఈ కార్యాలయం ప్రజలందరికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.

**మెరుగైన పౌర సేవలు:**

రాబోయే రోజుల్లో ఈ వార్డు ఆఫీసు ద్వారా పరిపరివిధాలైన పౌర సేవలను వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిరాశ్రయులకు మానవతా దృక్పథం ప్రభుత్వ పునరావాస చర్యలు కూల్చివేతల వల్ల నిరాశ్రయులైన పేద కుటుంబాల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో స్పందించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు: అక్రమ నివాసాలను తొలగించినప్పటికీ, అక్కడ నివాసముంటున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం తరఫున ప్రత్యామ్నాయ వసతి ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాల రక్షణతో పాటు, నిజమైన బాధితులకు అండగా నిలవడమే తమ ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేయడం పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు. మిన్నుముట్టిన కాలనీవాసుల ఆనందోత్సాహాలు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అంజయ్య నగర్ వార్డు ఆఫీస్ ఆక్రమణల తొలగింపుతో స్థానిక నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. “మా కాలనీలో ఉన్న ప్రభుత్వ వార్డు ఆఫీస్ గత 30 ఏళ్లుగా ఆక్రమణల పాలై నిరుపయోగంగా ఉండేది. డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ గారు ధైర్యంగా ముందుకు వచ్చి ఈ స్థలాన్ని కాపాడటం చాలా సంతోషకరం. ఇకపై మా సమస్యలను విన్నవించుకోవడానికి వార్డు ఆఫీస్ విశాలంగా, అందరికీ అందుబాటులోకి వచ్చిందని పలువురు కాలనీ వాసులు తెలిపారు. కాలనీ ప్రజలు, స్థానిక సీనియర్ పౌరులు శేరిలింగంపల్లి మున్సిపల్ అధికారులకు, టౌన్ ప్లానింగ్ బృందానికి ప్రత్యేకించి డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# పెద్ద చింతరేవులకు చేరుకున్న ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు





**పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు , భక్తులు**

**నేటి నుండి 56 రోజులపాటు పెద్ద చింతరేవులలో పీఠాధిపతుల చాతుర్మాస్యం ప్రత్యేక పూజలు...**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామం నందు 18వ శతాబ్దంలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉడిపి మరియు పాలిమారు పీఠాధిపతులు1008 శ్రీ విద్యా దేశ తీర్థ శ్రీపాదుల వారు,1008 విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు నేటి నుండి 56 రోజులపాటు 48వ చాతుర్మాస్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. ఉడిపి నుండి విచ్చేసిన పీఠాధిపతులకు పూర్ణకుంభం మేళతాళాలతో అర్చకులు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్ద చింతరేవుల ఆధ్యాత్మిక శోభతో వెల్లి విరిసింది. ప్రతిరోజు ఉదయం 6:30 నుంచి 7 గంటల వరకు మరియు 10:30 నుండి 12 గంటల వరకు భక్తులకు విశేష ప్రవచనాలు పీఠాధిపతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆద్య వామనాచారి, ఆద్య కిష్టా చారి, వివిధ ప్రాంతాల భక్తులు మహిళలు పాల్గొన్నారు.

# ఎల్ఎన్ఆర్ కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా బోనాల వేడుకలు







**రాజేంద్రనగర్,ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

బోనాల పండుగ అంటేనే తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాల వేడుక అని బండ్లగూడ కాళీ మందిర్ ఎల్ ఎన్ ఆర్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ జి ఎం రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ బి సునీత వెల్లడించారు. ఆషాడ మాసం బోనాల పండుగను పురస్కరించుకొని పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు బోనాల ఊరేగింపు తో పాటు పోతరాజుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి చిన్నారులు వేసిన పోతురాజు నృత్యాలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అలరించాయి.

# యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ




**మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'**

**పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ**

**రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన**

**న్యూఢిల్లీ,ఆగస్ట్7 (ప్రభాత ఉదయం)**

బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే దీనికోసం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంధ్రాల (ఫంగస్)లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర్'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్-హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక్ సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంధ్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందించారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక్ లెదర్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు. ఫంగీ లెదర్ తయారీ తర్వాత మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కూడా పూర్తిగా రీసైకిల్ చేయడం వల్ల వ్యర్థాలు దాదాపు ఉండవు. ఈ వినూత్న ఉత్పత్తి తయారీకి వరి పొట్టు, చెక్క ముక్కలు వంటి వ్యవసాయ వ్యర్థాలను వినియోగిస్తారు. ముందుగా వాటిని క్రిమిరహితం చేసి, ప్రయోగశాలలో తయారుచేసిన ప్రత్యేక పోషక మాధ్యమంతో కలుపుతారు. అనంతరం నియంత్రిత ఉష్ణోగ్రత, తేమ ఉన్న గదిలో పెద్ద ట్రేలలో ఉంచుతారు. కొన్ని రోజుల తర్వాత మైసీలియం క్రమంగా పెరిగి మొత్తం ఉపరితలాన్ని ఆక్రమిస్తుంది. సుమారు 20 రోజుల తర్వాత ఇది దట్టమైన పీచు నిర్మాణంగా మారుతుంది. దాదాపు 30 రోజుల తర్వాత ఆ పొరను సేకరించి, ప్రత్యేక ప్రక్రియల ద్వారా శుద్ధి చేసి, సాగే గుణం కలిగిన తోలుగా మారుస్తారు. చివరగా దీనిని అవసరానికి అనుగుణంగా రంగులు, ఫినిషింగ్ ఇచ్చి మార్కెట్‌కు సిద్ధం చేస్తారు.



## జూరాలకు కొనసాగుతున్న వరద

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

కర్ణాటక జలాశయాల నుంచి జూరాల ప్రాజెక్టు జలాశయంలోకి శుక్రవారం సాయంత్రం 2,25,000 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో డ్యాం అధికారులు 26 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 1,81,766 క్యూసెక్కులు బయటకు వెళ్తుండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 30,559 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొత్తంగా 2,16,870 క్యూసెక్కుల వరద బయటకు వెళ్తున్నది.కాగా, జూరాల డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.518 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం నీటిమట్టం 318,02 మీటర్ల వద్ద ఉన్నది. మొత్తం నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలకుగాను ప్రస్తుతం 8.651 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.





## ఆర్కా ఎలిట్ స్కూల్‌లో వైభవంగా బోనాల పండుగ వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 7 (ప్రభాత ఉదయం)**

బొల్లారం లోని ఆర్కా ఎలిట్ స్కూల్ లో శుక్రవారం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ముందస్తుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు సమర్పించగా, పోతురాజు వేషధారణలు, సాంస్కృతిక నృత్యాలు, జానపద కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. చివరగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించి, తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కె.శ్రీనివాస్ రెడ్డి, శ్రీ శ్లోక పాఠశాల కరస్పాండెంట్ హరికృష్ణా రెడ్డి, గ్లోరియస్ పాఠశాల కరస్పాండెంట్ సింహాచలం, గీతాంజలి రోబోటిక్ పాఠశాల కరస్పాండెంట్ కిషోర్, పాఠశాల ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.




## నిజాయితీ ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

**మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్7 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్? (ఆర్ఎస్ఎస్) చీఫ్? మోహన్? భాగవత్? ఇటీవల జెన్?-జీపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం తీవ్రంగా స్పందించారు. యువత పట్ల ఆయనకు నిజంగా నిజాయితీ ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్? షా చేత రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. అంతేకాదు ప్రస్తుతం ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని, కనుక నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై ఇటీవల జరిగిన పోలీసు చర్యకు ఆ సంస్థే బాధ్యత వహించాలని అన్నారు.ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నియంత్రిస్తోంది. వారికి జెన్? జీ యువతపై నిజంగానే శ్రద్ధ ఉంటే, కేంద్ర హోంమంత్రిని రాజీనామా చేయమని మోహన్ భాగవత్ అడగాలి. లేదంటే కనీసం పార్లమెంట్?కు వచ్చి విద్యార్థులకు, అలాగే ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పాలి. విద్యార్థుల పట్ల ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, పెల్లెట్? గన్స్?, లాఠీఛార్జ్ రూపంలో విద్యార్థులపై జరిగిన అణచివేతను ఆయన ఖండించాలి. కానీ దీనిపై ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇవన్నీ కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమేనని అన్నారు.